సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 9 । మార్చి । 2024



భక్తుల కల్పతరువు.. గంగమ్మ
రాయలసీమలోనే ప్రసిద్ధి గాంచిన శ్రీ అనంతపురం గంగమ్మ దేవత భక్తుల పాలిట కల్పతరువుగా విరాజిల్లుతున్నారు. అమ్మవారి జాతర ఈ నెల 10న మొదలవుతుంది. -8లో



వైఎస్సార్‌సీపీలో చేరికలు
కడప నగరంలోని దండు దళితవాడ ఎదురుగా ఉన్న 150 కుటుంబాల వారు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
39.8/23.2

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 23.2 – 39.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.25 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్



పూజలందుకుంటున్న పాలతల మల్లేశ్వరస్వామి



పాలతలలో స్వామివారి దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు



మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులు



భక్తులకు దర్శనమిస్తున్న నిత్యపూజస్వామి

శివోహం.. భక్తజన ప్రవాహం

- ప్రతిధ్వనించిన పంచాక్షరి
- పోటెత్తిన శైవక్షేత్రాలు
- స్వామివారికి ఘనంగా పూజలు

కడప కల్చరల్: కొండకోనల్లోని శైవ క్షేత్రాలు జనసంద్రాలయ్యాయి. లోయల్లో పంచాక్షరి ప్రతిధ్వనించింది. శివయ్య దర్శనం కోసం భక్తులు కనుచూపుమేర బారులు తీరారు. శివరాత్రి పర్వదిన సందర్భంగా లింగమూర్తిని మనసారా దర్శించుకుని తన్మయులయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసి తృప్తి చెందారు. హరోం హర..శివశంకర..అంటూ శైవ క్షేత్రాలన్నీ పంచాక్షరి నామంతో ప్రతిధ్వనించాయి. శివరాత్రి పర్వదిన సందర్భంగా శుక్రవారం జిల్లాలోని శైవ క్షేత్రాలుగల కొండ కోనలు భక్తులతో నిండిపోయాయి. దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఉదయం 4 గంటల నుంచి శివాలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఓ దశలో అడుగు తీసి అడుగు వేసేందుకు కూడా కష్టమైంది. అయినా భక్తులు అడుగడుగునా శివనామ స్మరణతో ఉత్సాహం తెచ్చుకుంటూ ఆ శ్రమను మరిచారు. స్వామిని దర్శించుకుని తన్మయులయ్యారు.

- గురువారం రాత్రికే ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో నిండిపోవడంతో శుక్రవారం ఉదయం స్వామిని దర్శించుకున్న భక్తుల్లో పలువురు తిరిగి తమ ప్రాంతాలకు చేరుకున్నారు. మరికొందరు అటవీ ప్రాంతాల్లోని శివాలయాలలో జాగరణ చేస్తే మరింత పుణ్యం లభిస్తుందని భావించి అక్కడే ఉండిపోయారు. ఇంకొందరు శుక్రవారం మధ్యాహ్నం బయలుదేరి అటవీ ప్రాంతాల శైవ క్షేత్రాలకు వెళ్లారు. జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు భక్తులకు సులభంగా శివయ్య దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేశారు. ధార్మిక సంస్థలు, ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో దారి వెంట పలుచోట్ల మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. మరికొన్ని చోట్ల శుక్రవారం మధ్యాహ్నం అన్నదానాలు నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు ప్రసాదాలు సులభంగా అందేటట్లు చర్యలు తీసుకున్నారు.



పాలతలలో భక్తుల రద్దీ

- మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం11గంటల నుంచి 12.00 గంటల వరకు పాలతలలోని శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవార్ల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణానికి కమలాపురం ఎమ్మెల్యే దంపతులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అరుణమ్మ పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించారు. కల్యాణంలో ఆలయ ఛైర్మన్ నాగమల్లారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే కుమార్తె రమత్యారెడ్డి పాల్గొన్నారు.
- పాలతల క్షేత్రంలో అక్క దేవతల గుడి చుట్టు అడుగడుగునా భక్తుల సందడి కనిపించింది. కొందరు మహిళా భక్తులు కోనేటిలో పుణ్య స్నానాలు ఆచరించారు. సంతానం కోసం అక్కదేవత గుడి ఎదుట వరపడ్డారు.ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పర్యవేక్షణలో డీఎస్పీ షరీఫ్, సీఐ నాగరాజు,ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పుణ్య స్థానాలు ఆచరిస్తున్న భక్తులు

వాహన వితరణ
మొక్కులు గల భక్తులు అటవీ ప్రాంతంలోని శివాలయాలకు భక్తులను చేరవేసేందుకు లారీలు, మినీ బస్సులు, వ్యాన్లు ఉచితంగా ఏర్పాటు చేశారు. ఆటోలు కూడా పెద్ద సంఖ్యలో భక్తులను ఆయా క్షేత్రాలకు తీసుకెళ్లాయి. ఆర్టీసీ కూడా గతం కంటే ఎక్కువ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. వైఎస్సార్ జిల్లాలో పాలతలకు బస్సుల కొరత లేకుండా చూసింది. నిత్యపూజ స్వామి కోనకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులు భక్తులను చేరవేశాయి.కన్యతీర్థం, భానుకోట, అల్లాడుపల్లె వీరభద్రస్వామి, ప్రొద్దుటూరులోని ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయం, అగస్త్యేశ్వరాలయం,బ్రహ్మంగారిమఠం, భైరవేశ్వరుని కోన, లంకమల, పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి, అన్నమయ్య జిల్లాలోని అత్తిరాల, రాయచోటి వీరభద్రస్వామి ఆలయం, మల్లయ్యకొండ క్షేత్రాలు శుక్రవారం భక్తులతో పోటెత్తాయి.



ప్రత్యేక అలంకరణలో అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి



వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



లంకమల్లేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాటులు



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

న్యూస్‌రీల్

రేపు విమానాశ్రయ టెర్మినల్ భవనానికి శంకుస్థాపన
కడప కోటిరెడ్డిసర్కిల్: కడప విమానాశ్రయ కొత్త టెర్మినల్ భవన శంకుస్థాపన కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్ అవి నాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, పౌర విమానయానాలశాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా, కేంద్ర మంత్రి డాక్టర్ విజయ్‌కుమార్ సింగ్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతారు.

డీసీసీబీ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

దువ్వూరు: దువ్వూరులోని పీడబ్ల్యూడీ బంగ్లా ఆవరణలో నిర్మించనున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఆప్కాబ్ ఛైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, దువ్వూరు కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ ఇరగంరెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయల సలహామండలి ఛైర్మన్ కానాల ఓబుళరెడ్డి, మాజీ ఎంపీపీ జెర్రి నడిపి ఓబయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాషా పాల్గొన్నారు.

కుందూ నదికి నీరు విడుదల



వెల్లాల వద్ద కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

రాజుపాళెం: వేసవిలో తాగునీటి అవసరాలకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 980 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి సంతజూటూరు పికప్ అనకట్ట మీదుగా నంద్యాల జిల్లాలోని కుందూనదికి విడుల చేశారు. రాజోలి ఆనటకట్టకు రాగానే 200 క్యూసెక్కులు కుందూ నదికి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కడప నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. దీంతో కుందూనది పరివాహక ప్రాంతాల్లోని బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. కేసీ ప్రధాన కాలువలో కూడా అడుగు మేర నీరు ప్రవహిస్తోంది.

కడప రాయుని కోవెలలో కల్యాణరాగం

కడప కల్చరల్: తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణ రాగాలు వినిపించాయి. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత కడప రాయుడి ఉత్సవ మూర్తులకు ఈ సందర్భంగా అభిషేకాలు జరిపారు. నూతన వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్ తదితరులు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో పూజలు చేపట్టారు. వేద పండితులే స్వామి, అమ్మవార్ల పక్షాన పెద్దలుగా నిలిచారు. అమ్మవారి మంగళ సూత్రాన్ని భక్తులకు దర్శింపజేసి అమ్మవార్ల గళసీమలో వాటిని అలంకరించారు. అనంతరం లాజహోమం నిర్వహించారు. ఉభయదారులకు తొలిప్రసాదం, వేదాశీస్సులు అందజేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకీపై మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు విశేష సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి, అమ్మవార్లను మొక్కుకుంటున్న భక్తులు

మదనపల్లె వైపు..చీతా చూపు!

- చీతా పునరుత్పత్తికి అనుకూలం
- విస్తారంగా టెరన్ ఏరియా

రాజంపేట: చీతా..ఈ భూమ్మీద అత్యంత వేగంతో పరిగెత్తే జంతువు. ఇప్పుడు దీని చూపు మదనపల్లె వైపు పడింది..అంటే చీతాలను పునరుత్పత్తి కేంద్రంగా ఎంపిక చేసుకోవాలనే భావన డబ్ల్యూఐఐ తెర పైకి తీసుకొచ్చినట్లు అటవీవర్గాల సమాచారం. 1965లో ఒక సారి చీతా కనిపించింది. ఆ తర్వాత ఈ జాతి కనుమరుగైంది.భారత్‌లో అంతరించిన ఈ జాతిని తిరిగి పునరుద్ధరించేందుకు చీతా ప్రాజెక్టు చేపట్టారు. 2022లో నమీబియా నుంచి తెచ్చిన 8 చీతాలను కునో నేషనల్ పార్క్(మధ్య ప్రదేశ్)లోకి వదిలిన సంగతి తెలిసిందే.

- అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె టెరన్ ఏరియా విస్తారంగా ఉండటంతో..ఆ ప్రాంతంలో చీతా పునరుత్పత్తికి దోహదపడుతుందనే యోచనలో వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు చెందిన ముఖ్య శాస్త్రవేత్త రమేష్ ఉన్నట్లు అటవీవర్గాలకు సమాచారం అందింది. ఈనెల 25న చీతా పునరుత్పత్తిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో సమావేశం ఉంటుందని అటవీవర్గాలు చెబుతున్నాయి.
- 70వేల హెక్టార్ల అటవీ ప్రాంతం కలిగిన మదనపల్లె రేంజ్ ప్రాంతం టెరన్ ఏరియాగా పిలుస్తారు. 18 మండలాలు ఉన్నాయి. కొండ, గట్టు, గడ్డి విపరీతంగా పెరగడం లాంటి ప్రదేశాలు ఉన్నాయి. వాతావరణం కూడా చల్లగా ఉంటుంది. అందువల్ల చీతాల పునరుత్పత్తి ఉండటానికి అనుకూల ప్రదేశంగా అటవీ వర్గాలు భావిస్తున్నాయి. అటు కర్ణాటక, ఇటు చిత్తూరు, మరోవైపు సత్యసాయి జిల్లాలతో టెరన్ ప్రాంతం ముడిపడి ఉంటుంది.



- చీతా అనే పదం..హిందుస్థానీ నుంచి పుట్టింది. సంస్కృతంలో దీనర్థం చిత్ర..యా అంటే రంగురంగులది అని. చీతాలు నాలుగు ఉపజాతులుగా ఇప్పుడు భూమ్మీద ఉన్నాయి. సౌతాఫ్రికన్ చీతాలు, ఆసియాటిక్ చీతాలు, నార్త్ ఈస్ట్ ఆఫ్రికన్ చీతాలు, నార్త్‌వెస్ట్ చీతాలు. చీతా గర్జిస్తుందని పొరపాటు పడొద్దు. దాని గొంతులో ఉన్న ప్రత్యేకత వల్ల అది గర్జించలేదు. పిల్లిలాగే మియావ్ అని, లేదంటే పిష్ అంటూ విచిత్రమైన అరుపులు చేస్తుంది.
- చీతా వేట నిమిషం కంటే వ్యవధిలోని ముగిస్తుంది. ఇది ఎంతలా అంటే స్పోర్ట్స్ కారుకంటే వేగంగా. చీతాలకు వాటి లుక్కే ప్రధాన ఆకర్షణ. అందుకే వాటిని పెంచుకునేందుకు ఆసక్తి చూపుతుంటారు. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో పరుగుతీసింది.
- చీతాలకు త్వరగా దొరికే ఆహారం అంటే ఇష్టం. అందుకే కుందేళ్లు, జింకలను వేటాడుతాయి. పెద్దవాటి జోలికి ఎక్కువగా పోవు. ఇతర జంతువుల బెడదను దృష్టిలో పెట్టుకొని త్వరగా తినేస్తాయి.

మదనపల్లె ప్రాంతం అనుకూలం



చీతా జీవించడానికి .. వాటి మనుగడకు మదనపల్లె అటవీ ప్రాంతం అనుకూలమనే అభిప్రాయం ఉంది. దీనిపై పరిశోధన నిమిత్తం డబ్ల్యూఐఐకి చెందిన చీఫ్ సైంటిస్టు రమేష్ ఈ అంశం గురించి ప్రస్తావించారు. ఈనెల 25న సమావేశం ఉంటుందని సమాచారం అందింది.
–వివేక్, జిల్లా అటవీశాఖాధికారి, రాజంపేట

పది ఫలితాల్లో అగ్రస్థానమే లక్ష్యం

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- డీఈఓ మర్రెడ్డి అనూరాధ

కడప ఎడ్యుకేషన్: పదోతరగతి ఫలితాల్లో వైఎస్సార్ కడపజిల్లాను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించిందని జిల్లా విద్యాశాఖాధికారి మర్రెడ్డి అనూరాధ పేర్కొన్నారు.గత సంవత్సరం నాలుగోస్థానంలో ఉన్న జిల్లాను ఈ ఏడాది మొదటి, రెండో స్థానాల్లో నిలిపేలా కృషిచేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నామని ఆమె పేర్కొన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులైన ఆమె పలు విషయాలను వెల్లడించారు.

?: జిల్లాలో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలను ఎంతమంది విద్యార్థులు రాస్తున్నారు.

■ జిల్లావ్యాప్తంగా 581 ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల నుంచి 27,858 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలను రాస్తున్నారు. ఇందులో 14,269 మంది బాలురు, 13,589 మంది బాలికలు ఉన్నారు.

?: ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి

■ ఈనెల 18 నుంచి జిల్లా వ్యాప్తంగా 153 పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలను నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ఇందుకోసం ఇప్పటికే పలు మార్లు అధికారులతో సమావేశం నిర్వహించి, నిర్వహణపై సూచనలు, సలహాలను ఇచ్చాం.



డీఈఓ మర్రెడ్డి అనురాధ

సాక్షి ఇంటర్వ్యూ

?: ఎలాంటి ఫలితాలను అంచానా వేస్తున్నారు

■ పదోతరగతి ఫలితాల్లో వైఎస్ఆర్ కడప జిల్లాకు చక్కటి రికార్డు ఉంది. గతంలో పలుమార్లు రాష్ట్రంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచింది. గతేడాది నాలుగో స్థానంలో నిలవగా, ఈ సంవత్సరం కనీసం మొదటి, రెండో స్థానాల్లో ఉండేలా శ్రమిస్తున్నాం.

?: పది పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలపై ఎలాంటి చర్యలు చేపట్టారు

■ ఇప్పటికే పరీక్ష కేంద్రాలను గుర్తించి, వాటిల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చూస్తున్నాం. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

?: గ్రామీణ ప్రాంత విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

■ ఇందుకోసం అధికారులు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్‌టికెట్ చూపించి బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

?: జిల్లాలో ఎన్ని సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు

■ జిల్లావ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించాం. ఇందులో ఖాజీపేట బాలికల జిల్లా పరిషత్తు హైస్కూల్, కాశినాయన మండంలంలో ఏపీమోడల్ స్కూల్, నందిమండలం జిల్లా పరిషత్తు హైస్కూల్, చక్రాయపేట కేజీబీవీ, కలనసాడు జిల్లా పరిషత్తు హైస్కూల్, కొండాపురం ఏపీఎస్‌డబ్లుఆర్‌ఎస్ ఉన్నాయి. వీటన్నింటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం.

?: పరీక్షల విధుల్లో ఎంతమంది స్క్వాడ్ బృందాలు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు

■ జిల్లా వ్యాప్తంగా 153 పరీక్ష కేంద్రాల్లో 12161 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. వీరితో పాటు 153 మంది చీఫ్ సూపరింటెండెట్లు, 153 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు నియమించాం. వీరితోపాటు సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలు, పరీక్షల అబ్జర్వర్లు పరీక్షలను తనిఖీ చేయనున్నారు.

?: పదోతరగతి ఫలితాల మెరుగుకు ఎలాంటి చర్యలు చేపట్టారు

■ ప్రతిరోజూ విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణతో పాటు, సిలబస్ సకాలంలో పూర్తి చేయడం, ప్రీఫైనల్ పరీక్షల ఫలితాల ఆధారంగా పాఠశాల విద్యార్థుల స్థాయిని అంచనావేసి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేలా మార్గనిర్దేశం చేశాం. విద్యార్థులు ఎలా చదువుతున్నారో నిత్యం వారి తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ వారి ఉపాధ్యాయుల ద్వారా తీసుకుంటున్నాం.

?: పదోతరగతి విద్యార్థులకు సంబంధించిన పరీక్ష సామగ్రి పరిస్థితి ఏంటి

■ పదోతరగతికి సంబంధించిన పరీక్ష సామగ్రిని మండలాల వారీగా ఆయా కేంద్రాలకు చేరవేశాం. దీంతోపాటు ప్రశ్న సెట్–1 ఈ నెల 7వ తేదీన వచ్చాయి. సెట్–2 కూడా వస్తాయి. వీటన్నింటి కూడా భద్రత ఏర్పాట్ల మధ్య ఆయా పోలీసు స్టేషన్లకు చేరుస్తాం. అక్కడి నుంచి పరీక్ష కేంద్రాలకు చేరవేస్తాం.

ప్రవాసాంధ్రుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్

కడప కార్పొరేషన్: ప్రవాసాంధ్రుల సంక్షేమమే ఏపీఎన్ఆర్‌టీఎస్ లక్ష్యమని ఆ సంస్థ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ అన్నారు. శుక్రవారం దోహా ఖతార్‌లోని ఉమర్ ప్రాంతంలో ఇండియన్ చర్చ్ కాంప్లెక్స్‌లోని తెలుగు చర్చి క్రిష్టియన్ ఫెలోషిప్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న 29 రాష్ట్రాల్లో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రవాసాంధ్రుల సంక్షేమం, వారి సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో అధ్యక్షులు మేడపాటి ఎస్ వెంకట్ నేతృత్వంలో తమ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారు దుర దృష్టం కొద్దీ ఎవరైనా మరణిస్తే వారి భౌతికకాయాన్ని స్వరాష్ట్రం పంపినప్పుడు బాడీని విమానాశ్రయం నుంచి స్వగృహం వరకు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేస్తుందని, మరణించిన వారిలో పేద వారు ఉంటే గుర్తించి వారి కుటుంబానికి 50 వేలు ఎక్స్‌గ్రేషియా ద్వారా ఆర్థికంగా ఏపీఎన్ఆర్‌టీఎస్ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో చర్చ్ ఫాస్టర్ బుల్లబ్బాయి, ఖతార్ కో ఆర్డినేటర్స్ శశికిరణ్ , వర్జిల్ బాబు, రజని మూర్తి, మనీష్ రెడ్డి, లక్ష్మణ్, వసంతప్ప, వెంకట్రామ్, నల్లి నాగేశ్వరరావు, జయరాజు, లియో పాల్గొన్నారు.

కుక్కల దాడి.. పొడదుప్పి మృతి


పొడదుప్పి బతికి ఉన్నప్పటి దృశ్యం

అట్లూరు : తాగునీటి కోసం అడవి నుంచి వచ్చిన పొడదుప్పి కుక్కల బారిన పడి మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీలంక మల్లేశ్వర అభయారణ్యం నుంచి పొడ దుప్పి ఎస్.వెంకటాపురం కాలనీలోకి తాగునీటి కోసం వచ్చింది. గమనించిన కుక్కలు వెంబడించి గాయపరిచాయి. వెంటనే స్థానికులు కుక్కలను తరిమి గాయపడిన పొడదుప్పిని సిద్దవటం అటవీ అధికారులకు అప్పగించారు. అయితే వైద్యం నిమిత్తం అట్లూరు పశువైద్యశాలకు తరలించేలోపే మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించి అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, గార్డు విశ్వనాథరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్ రమణ తెలిపారు.

భక్తుల కల్పతరువు.. అనంతపురం గంగమ్మ

- 10న జాగారం, 11, 12 జాతర మహోత్సవం
- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు

లక్కిరెడ్డిపల్లె : రాయలసీమలోనే ప్రసిద్ధి గాంచిన శ్రీ అనంతపురం గంగమ్మ దేవత భక్తుల పాలిట కల్పతరువుగా విరాజిల్లుతున్నారు. అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 10న జాగారంతో మొదలవుతుంది. 11, 12న జాతర మహోత్సవం లక్షలాది మంది భక్తుల నడుమ జరగనుంది. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, సర్పంచ్‌లు వెంకటనారాయణరెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి రవీంద్ర రాజు తెలియజేశారు.

ఆలయ ప్రాశస్త్యం

అనారోగ్యానికి గురైన వారికి అభయమిస్తూ, సంతానం లేని వారికి సంతానాన్ని ప్రసాదిస్తూ, నిత్యారాధనలతో విశేష పూజలందుకుంటున్న అనంతపురం గంగమ్మ దేవత అన్నమయ్య జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో కొలువు దీరారు. ఏటా మహాశివరాత్రి ముగిసిన రెండవ రోజు నుంచి జాతర ప్రారంభమవుతుంది. అమ్మవారికి పుట్టినిల్లుగా భావించే కస్తూరాజుగారిపల్లె గ్రామంలోని చాగలగుట్టపల్లె నుంచి గంగమ్మ దేవత ఉత్సవ విగ్రహాన్ని తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గట్టి పోలీసు బందోబస్తు నడుమ సంప్రదాయబద్ధంగా.. మద్దిరేవుల గ్రామంలోని అప్పలరాజుగారిల్లె, మార్లవాండ్లపల్లె, మర్రిచెట్టు, చౌటపల్లె గ్రామాల మీదుగా వేలాది మంది మంది భక్తుల నడుమ దారి పొడవునా అమ్మవారికి జంతు బలులు ఇస్తూ జాతర జరిగే ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకొస్తారు. ఆలయానికి ఉత్సవ విగ్రహం చేరుకోగానే అనంతపురం ఈడిగపల్లెకు చెందిన గౌడ్ కులస్తులు అమ్మవారికి ఎదురు వచ్చి కల్లు సాంగ్యంతో శాంతింప చేసి ఆలయంలోనికి చాగలగుట్టపల్లె అమ్మవారిని తీసుకు వస్తారు. అప్పటికే సంతానం లేని వారు తడి బట్టలతో ఆలయంలో సాష్టాంగ నమస్కారంతో ఉండటంతో.. అమ్మవారికి వరపడిన సంతానం లేని మహిళల మీదుగా గంగమ్మ దేవతను ఆలయంలోకి తీసుకెళ్తారు. గుడి ముంగిటకు అమ్మవారు రాగానే జాతరలో ఒక్క సారిగా పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి జంతు బలులను ఇస్తారు. ఇదే రోజు శిద్దల పూజ, సిడిమాను పూజలతోపాటు, రాత్రి చాందిని, కుంకుమబండ్లు తిప్పి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. మొదటి రోజును నిండు తిరునాలగా, రెండవ రోజును మైల తిరునాలగా భావిస్తారు. ఆ రెండు రోజులు జాతరకు వచ్చిన భక్తులకు దాతలు అన్నదానం, ఉచిత తాగు నీరు సదుపాయాలు కల్పిస్తారు. మైలతిరునాల సాయంకాలం గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని చాగలగుట్టపల్లెకు చేర్చడంతో తిరునాల పరిసమాప్తం అవుతుంది.

స్థల మహత్యం

అనంతపురం గ్రామంలోని ప్యారంవాండ్లపల్లెకు చెందిన ప్యారం బుడ్డారెడ్డి తన మామిడితోటకు కంచె వేయడానికి కంప తొడుగులు కొట్టి బండ్లతో తోలుతుండగా, ఒక కంప తొడుగు ఎంత ప్రయత్నించినా కదలకపోవడంతో, ఏడు గాండ్ల ఎద్దులు కట్టి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ప్యారం బుడ్డారెడ్డి విచార వదనంతో ఆరోజు రాత్రి ఆలోచిస్తుండగా మహామంత్రాది శక్తులు కలిగిన చెల్లు వంశానికి చెందిన యాదవ కులస్తులైన చెల్లు నాగబస్సన్న, చెల్లు గంగాల పాలకొండు అనే వారు గంగిరెద్దులాట ఆడుకొంటూ ఆ గ్రామానికి చేరుకున్నట్లు చరిత్ర. వీరికి బుడ్డారెడ్డి కంపతొడుగు విషయం తెలియచేయగా.. వారు అక్కడ ఒక మహా శక్తి వంతమైన గంగమ్మ తల్లి వెలసి వుందని తెలియజేశారు. అదే రోజు రాత్రి బుడ్డారెడ్డికి కూడా కలలో గంగమ్మతల్లి కనిపించి నాపైగల కంపతొడుగు నుంచి ఒక్కొక్క కొమ్మను తొలగించండి, నేను మీకు ప్రత్యక్షమవుతానని, అదే స్థలంలో గుడి నిర్మాణం చేపట్టాలని తెలపడంతో, అప్పుడే అదే గ్రామంలోని శ్రీ అనంత వరదరాయులు అనే దేవతా మూర్తి వెలసి వున్నారు. ఈ దేవతా మూర్తి బుడ్డారెడ్డికి కలలో కనిపించి నేను గంగమ్మ తల్లి శక్తి ముందు ఎదురు నిలవలేను కావున, ఎడ్లబండి సాయంతో దిన్నెపాడు గ్రామానికి చేర్చవలసిందిగా కోరడంతో, బుడ్డారెడ్డి తమ ఎద్దుల బండి సాయంతో ఆ విగ్రహాన్ని దిన్నెపాడుకు తరలించినట్లు పూర్వీకుల సమాచారం. అనంతరం ప్యారం బుడ్డారెడ్డి గంగమ్మ దేవతకు గర్భగుడిని నిర్మించగా.. రాయారం రెడ్లు అసంపూర్తిగా వున్న గుడిని నిర్మించి పూర్తి చేశారు. గుడి నిర్మాణానంతరం గంగమ్మ తల్లికి బుడ్డారెడ్డి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, వారి కుటుంబ సభ్యులు కొద్ది రోజుల్లోనే అనారోగ్యం పాలయ్యారనేది చరిత్ర. దీంతో విచారం వ్యక్తం చేస్తున్న బుడ్డారెడ్డికి కలలో గంగమ్మతల్లి ప్రత్యక్షమై నా ఉనికిని తెలియజేసిన చెల్లు వంశస్తులకు పూజాది బాధ్యతలు అప్పగించాలని, ఏటా మాఘమాసం శుద్ధ పాడ్యమి నాటి నుంచి పాల్గుణ మాసం శుద్ధ విదియ వరకు జాతర కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా తెలియజేసినట్లు చెబుతుంటారు. గంగమ్మతల్లి ఆజ్ఞానుసారం బుడ్డారెడ్డి చెల్లు వంశస్తులను పిలిపించి బాధ్యతలను అప్పగించి అప్పటి నుంచి జాతరను అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీగా మారింది. 18వ శతాబ్దం చివరి కాలంలో కడపను పరిపాలిస్తున్న నవాబులు కూడా గంగమ్మ తల్లి శక్తిని గ్రహించి నిత్యం పూజాది కార్యక్రమాలు నిర్వహించడానికి అర్చకులకు 34 ఎకరాల భూములను కూడా మాన్యంగా కేటాయించారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత మూలవిరాట్


అనంతరపురంలోని గంగమ్మ దేవత ఆలయం

చేరుకునే మార్గాలు

గంగమ్మ జాతర జరిగే ప్రాంతానికి భక్తులు చేరుకోవడానికి రోడ్డు మార్గానికి సంబంధించి మూడు దారులు ఉన్నాయి. కడప నుంచి రామాపురం ద్వారా చేరుకోవచ్చు. రాయచోటి- కడప జాతీయ రహదారిలో వున్న చిట్లూరుకు పడమర వైపు రోడ్డు నుంచి వెళ్లవచ్చు. లక్కిరెడ్డిపల్లె-రాయచోటి మార్గంలోని మర్రిచెట్టు నుంచి తూర్పు వైపున వుండే రోడ్డు నుంచి చేరుకోవచ్చు. లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం ఎదురుగా వున్న రోడ్డు నుంచి గద్దకుంట రాచపల్లె, ఈడిగపల్లె, చౌటపల్లె మార్గాల ద్వారా రావచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తిరునాల కార్యక్రమాలు

10న ఆదివారం రాత్రి చాగలగుట్టపల్లెలో అమ్మవారి జాగారం, 11న సోమవారం నిండు తిరునాల, అమ్మవారికి శిద్దల పూజ, చిడిమాను తిరగడం, సర్వదర్శనం, బోనాలు, చాందినీ బండ్లు ఊరేగింపు జరుగును. 12న మంగళవారం మైల తిరునాల ఊరేగింపు, గంగస్నానాలు, అభిషేకాలతో తిరునాల ముగుస్తుంది.

సాంస్కృతిక కార్యక్రమాలు

10న రాత్రి చాగలగుట్టపల్లెలో అమ్మవారి జాగారం రోజున సాసవల చిన్నమ్మ కథ, హరికథ, బుర్రకథ కాలక్షేపాలు, 11న రాత్రి గొల్లపల్లె రవి బృందంచే చెక్క భజన, జబర్దస్త్, రెలారే రెలా ప్రోగ్రాంతోపాటు డాన్స్ ప్రోగ్రాం నిర్వహిస్తారు.

సామాన్య భక్తులకు పెద్దపీట


సామాన్య భక్తులకు పెద్ద పీట వేసేలా అధికారులు, పోలీస్ యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చాం. మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీకి సూచించాం.
– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

ఏర్పాట్లు పూర్తి చేశాం


భక్తులకు మెరుగైన వసతులను కల్పించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశాం. దాతల సహకారంతో ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీళ్లు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– మురికినాటి రెడ్డెయ్య, చైర్మన్, అనంతపురం గంగమ్మ దేవత ఆలయం

భక్తులందరికీ దర్శన సౌకర్యం


రాయలసీమ నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా ముందే భక్తులు చేరుకుంటారు. వీఐపీ దర్శనంతోపాటు సర్వదర్శనం ద్వారా భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.
– రవీంద్రరాజు, ప్రత్యేక అధికారి, గంగమ్మ ఆలయం

జూదరుల అరెస్ట్

కొండాపురం : పొట్టిపాడు గ్రామ శివారులో జూదం ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ యోగీంద్ర శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.35 లక్షలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అలాగే కొండాపురంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.19750 స్వాధీనం చేసుకున్నామన్నారు.

150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని దండు దళితవాడ ఎదురుగా ఉన్న 150 కుటుంబాల వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ఆశయాలు నచ్చి ఎంతోమంది పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎంతో వెనుకబడిన ఈ జిల్లాను ఏ పాలకులు పట్టించుకోలేదని, ఒక్క వైఎస్సార్, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిలు మాత్రమే మేలు చేశారన్నారు. అందుకే ఇక్కడి ప్రజలు వారిని తమ హృదయాల్లో ఉంచుకున్నారని తెలిపారు. ఆటో గ్యారేజ్‌లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి తాను కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఆటో గ్యారేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబా, ఉపాధ్యక్షుడు రఫీక్, ఇన్‌చార్జి షేక్ నాసిర్, సెక్రటరీ బాంబే, మెకానిక్‌లు కమాల్, పద్మ, జబీర్ బీకే, ఫర్హాద్, ఖాద్రి, సలీం తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహమ్మద్‌బాషా, ఎస్. సుబ్బారెడ్డి, ఉమైర్ తదితరులు పాల్గొన్నారు.

'ముస్లిం నూర్‌బాష్ దూదేకుల' గుర్తింపుపై హర్షం


మాట్లాడుతున్న దూదేకుల సంఘం నాయకుడు బాదుల్లా

కడప రూరల్ : ప్రభుత్వం నూర్‌బాష్ దూదేకుల విద్యార్థులకు టీసీల్లో ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ ముస్లిం నూర్‌బాష్ దూదేకులగా గుర్తించాలని ఆదేశిస్తూ సర్కులర్‌ను జారీ చేయడంపై దూదేకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది వరకు తమ వర్గానికి చెందిన విద్యార్థుల టీసీల్లో హిందూ దూదేకుల అని గుర్తించే వారన్నారు. దీంతో ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో నష్టం వాటిల్లేదని అన్నారు. ఈ అంశాన్ని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని దూదేకులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పగిడాల పెద్దన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగూరు కుళ్లాయప్ప, మహబూబ్‌బాష, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

మొల్ల కవితాశక్తి చిరస్మరణీయం


నాగేంద్రమ్మను సత్కరిస్తున్న హనుమంతరావు

బద్వేలు అర్బన్ : తెలుగు సాహిత్యంలో ధ్రువతార లాంటి మొల్ల కవితాశక్తి చిరస్మరణీయమని పులివెందుల ప్రభుత్వ బాలికల కళాశాల సంస్కృత ఉపన్యాసకురాలు డాక్టర్ వై.నాగేంద్రమ్మ పేర్కొన్నారు. మహాకవయిత్రి మొల్ల సప్త శతాబ్ధి జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని పెన్షనర్స్ భవనంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రామాయణం ఉన్నంత కాలం మొల్లమాంబ, ఆమెకు నిరంతర సుమార్చనలు చేస్తున్న హనుమంతరావు చిరస్థాయిగా నిలుస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే కమలమ్మ మాట్లాడుతూ తెలుగుజాతి పుణ్యఫలమైన మొల్ల మన ప్రాంత వాసి కావడం తెలుగు ప్రజల అదృష్టమన్నారు. అనంతరం ఆధ్యాత్మిక, విద్యారంగాలకు సమాజసేవ చేసిన డాక్టర్ వై.నాగేంద్రమ్మకు మొల్ల సాహితీసేవా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే కడపలో మొల్లమాంబ పేరుతో తెలుగు అకాడమీని నెలకొల్పి గోపవరం మండలానికి మొల్లపేరు పెట్టాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, బ్రహ్మయ్య, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రతినిధి చొప్పారాఘవేంద్రశేఖర్, బీసీ సంఘం నాయకులు గురుమూర్తి, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ బి.క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

బ్రహ్మంగారిమఠం : భవిష్యత్ కాలజ్ఞాన ప్రబోధకుడు శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణం మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక శ్రీవీరబ్రహ్మ క్షేత్రంలోని కల్యాణ మండపంలో జిల్లాలోని పెద్దపుత్త వాసులు తాడిగొట్ల నారాయణరెడ్డి, వీరారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించగా, మఠం వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణం సందర్భంగా ప్రభుత్వం తరఫున ఆరేళ్లుగా కదిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది నరసింహస్వామి దేవాలయం నుంచి దేవదాయ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి తీసుకొచ్చి సమర్పించారు. ఆయనకు మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, దేవస్థానం మేనేజర్ ఈశ్వరాచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి పెద్దభార్య కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరం భట్లయ్యస్వామి, దత్తాత్రేయ స్వామి దంపతులు, రెండవ భార్య ఇద్దరు కుమారులు, ఆలయ అర్చకులు, పలువురు భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. తిలకించేందుకు ఉభయ జిల్లాల నలుమూలల నుంచే కాకుండా రెండు తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు వచ్చారు. అందరూ భక్తులు కల్యాణం తిలకించేందుకు వీలుగా దేవస్థానం నిర్వాహకులు ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఎండ తీవ్రతను తట్టుకొనేందుకు మజ్జిగ, నీళ్ల పంపిణీ చేశారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాలలో దూర ప్రాంతం నుంచి వచ్చిన భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు. రాత్రి జాగరణ సందర్భంగా ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ విద్యాసాగర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు


ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నారు. మా పిల్లలకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాల ద్వారా మాకు లబ్ధి చేకూరింది.
– కనుమలకాల్వ వెంకటలక్షుమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

అమ్మ ఒడితో హాయిగా చదువులు


నా పేరు శెట్టి ప్రసన్న. నా భర్త రాజేంద్ర సన్నకారు రైతు. మాకు ముగ్గురు పిల్లలు. శ్రావణ్ కుమార్ ఆరో తరగతి, యశ్వంత్ 2వ తరగతి, అజిత్ కుమార్ ఒకటో తరగతి చదువుతున్నారు. శ్రావణ్ కుమార్ ఐదో తరగతిలో ఉండగా మొదటి సారి నాకు అమ్మ ఒడి ఆర్థిక సాయం మంజూరైంది. రెండో అబ్బాయి యశ్వంత్ రెండో తరగతి ఉండగా రెండో సారి సాయం అందింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పేరుతో అందిస్తున్న ఆర్థిక సాయంతో పిల్లల చదువులు హాయిగా సాగుతున్నాయి. వీటికి తోడు వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ తదితర పథకాలతో మా కుటుంబానికి ఈ ఐదేళ్లలో రూ.82,783 లబ్ధి చేకూరింది. జగనన్న పాలనలో ఇన్ని పథకాలతో ఆర్థిక సాయం అందుతుందని ఊహించలేదు. ఆయన మేలును మర్చిపోలేము.
– శెట్టి ప్రసన్న, ఆదిరెడ్డిపల్లె, మైదుకూరు మండలం

తిరుపాల్‌రెడ్డి జీవితం.. స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


'దువ్వూరు సీమలో ఇరగంరెడ్డి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

దువ్వూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుల్లారెడ్డిపేటలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రముఖ రచయిత డాక్టర్ తవ్వా వెంకటయ్య.. ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డిపై రచించిన 'దువ్వూరు సీమలో ఇరగంరెడ్డి' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వూరు మండలాన్ని తిరుపాల్‌రెడ్డి, ఆయన కుటుంబం అన్ని విధాలా అభివృద్ధి చేశారని తెలిపారు. మండలంలో ఎక్కడా హైస్కూల్ లేని కాలంలో ఆయన సొంత స్థలం ఇచ్చి హైస్కూల్ నిర్మించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఆయన రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగా సొసైటీ ప్రెసిడెంట్‌గా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, జిల్లా కోశాధికారిగా, డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా పదవులు చేపట్టారన్నారు. 2014, 2019 ఎన్నికల్లో తన విజయానికి కృషి చేశారని, అందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. తిరుపాల్‌రెడ్డికి వైఎస్సార్ ఫ్యామిలీతో బంధత్వం ఉందని, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉంటూ వైఎస్సార్‌కు మంచి సలహాలు ఇచ్చేవారని కొనియాడారు. వైఎస్సార్ కుటుంబం ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డికి సముచిత స్థానం కల్పించిందన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎంతో కష్టపడి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఆయన, వారి కుటుంబం స్థాపించిన జూనియర్, డిగ్రీ కాలేజీల్లో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ దువ్వూరులోని డీసీసీ బ్యాంకు కోసం స్థల సేకరణకు కృషి చేశారన్నారు. ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ 1962 నుంచి తాను రాజకీయాల్లో ఉన్నానని, ప్రజాభిమానంతో ఇప్పటి వరకు కొనసాగుతున్నానని, మా తాత, నాన్న అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవ చేస్తున్నానన్నారు. రాజకీయాల్లో వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి ఆయన మాటకు ఎప్పుడు కట్టుబడి ఉండేవాడినని తెలిపారు. వైఎస్సార్ తన మీద గౌరవంతో ఎన్నో బాధ్యతలు అప్పగించారని, ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి అప్పట్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేశానన్నారు. ఇప్పుడు సీఎం జగన్ అడుగుజాడల్లో నడుస్తూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం తిరుపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు, బి.మఠం ఎంపీపీలు కానాల జయచంద్రారెడ్డి, వీరనారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి కానాల ఓబుళరెడ్డి, మాజీ ఎంపీపీ ఇరగంరెడ్డి విజయగోపాల్‌రెడ్డి, దువ్వూరు సొసైటీ చైర్మన్ ఇరగంరెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు మారెళ్ల రామచంద్రారెడ్డి, జొన్నవరం వీరారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, పుస్తక రచయిత డాక్టర్ తవ్వా వెంకటయ్య, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలె మల్లికార్జునరెడ్డి, ప్రముఖ అవధాని డాక్టర్ నారాల రామారెడ్డి, డీకే చదువుల బాబు, జింకా సుబ్రహ్మణ్యం, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి పాల్గొన్నారు.